వంకర గీతలు

ప్రొద్దుగాటి వాలుజడా, జడలో కదంబమాల, కళ్ళకు కాటుక, కుంకుమ బొట్టు, మెడలో నల్ల పూసలు, కంచి పట్టుచీర, అదే రంగు బ్లౌజ్, సాదా చెప్పులు, పమిట భుజంనిండా కప్పుకుని తెలుగుతనం ఉట్టిపడుతూన్న వేషంలా వచ్చగా, నాజూగ్గావున్న శాంతి, రావు వెనకాలే హాల్లో అడుగుపెట్టింది.

కళ్ళు జిగేలుమన్నాయి. రంగురంగుల కాంతులు చిమ్ముతూ రకరకాల ఆకారాల్లో దీపాలు, నున్నగామెరిసే ఫ్లోరింగూ, చుట్టూ సోఫాలనిండా ఆధునిక దుస్తుల్లో వున్న ఆడవాళ్ళు, వాళ్ళకెదురుగానిలబడి కబుర్లుచెబుతూ మగవాళ్ళు, చేతుల్లో రంగు రంగుల పానీయాలు, నవ్వులు, మాటలు, అంతా అట్టహాసంగా వుంది. మగవాళ్ళంతా ఒకలాగే కనబడుతున్నారు. వైవిధ్యమంతా ఆడవారిలోనే!

చుట్టూ ఓ డజను జతల కళ్ళు కుతూహలంగా యిటు తిరిగాయి. శాంతి వింతగా చుట్టూ చూసి కొద్దిక్షణాలు తల దించుకుంది. రావు గుంపులో కల్సిపోయాడు.

పెళ్ళయి మూడేళ్ళయినా రావు సిక్కింలో ఉండిపోవటం మూలాన శాంతికి సైనికోద్యోగి భార్యగా సాంఘికజీవితం అనుభవంలోకి రాలేదు. రావుకి ఈ ప్రాంతానికి బదిలీ అయి నెల కావస్తూంది. అది ఆమెకి మొదటి అనుభవం.

జనరల్ భగత్ గౌరవార్థం ఆ రాత్రి మెస్‌లో "సోషల్‌నైట్" ఏర్పాటు చేయబడింది. బఫె డిన్నరు, ఆ తర్వాత డాన్స్, బయట రెజిమెంటల్ బాండ్ వాద్యాలు వినబడుతున్నాయి.

"నమస్తేజీ!" తెల్ల షార్క్‌స్కిన్‌కోటు, నల్ల బౌ, నల్ల పాంటు, వచ్చగా పొడుగ్గా ఒకతను చేతులు జోడించాడు.

"నమస్తే!" ఉలిక్కిపడింది శాంతి.

"నేను లెఫ్టినెంట్ మెహ్రా" పరిచయం చేసుకున్నాడు మెహ్రా.

"శాంతి" మొహమాటపడుతూ చెప్పింది శాంతి.

"రండి" మర్యాదగా దారి చూపించి తీసుకువెళ్ళి ఒక సోఫామీద కూర్చో బెట్టాడు మెహ్రా.

అంతకుముందు కూర్చున్న యిద్దరూ చెరోవైపు జరిగి ఆమెకి చోటిచ్చారు.

"ఏం తీసుకుంటారు?" అడిగాడు మెహ్రా ఇంగ్లీషులో.

"నాకేం వద్దండి."

"మీకు కావాలా, వద్దా అని అడగలేదు నేను!" ఆమె జవాబు వినకుండానే వెళ్ళిపోయాడు మెహ్రా.

"మనం ఇంతకు ముందు కలుసుకోలేదు. నేను మిసెస్ అరోరా" కుడివైపు ఆమె తనని తాను పరిచయం చేసుకుంది.

"మిమ్మల్ని కలుసుకోడం ఆనందంగా వుంది, నేను కాంతి."

"ఈమె మిసెస్ తివారి."

"నమస్తే, చాలా సంతోషం! నా పేరు కాంతి." మిసెస్ తివారి వంక తిరిగి అంది కాంతి.

"ఇంక ఆ పేరు మరిచిపోవాలి మీరు. ఇకమీదట ఇక్కడున్నంత కాలం మీరు మిసెస్ ఎవరో ఒకరు!" నవ్వుడూ సరిదిద్దింది మిసెస్ తివారి.

"క్షమించండి, మిసెస్ రావు!" సిగ్గుపడింది కాంతి. అది ఆమెకి మొదటి పాఠం. ఏదో పెద్ద నేరంచేసి పట్టుబడ్డ దొంగలా అదోలా అనిపించింది.

"మేజర్ రావ్ కొత్తగా వచ్చారు గదూ?"-మిసెస్ తివారి.

"అవును, వచ్చి నెలవుతుంది."

మిసెస్ అరోరా పొట్టిగా, లావుగా, తెల్లగా వుంది. పల్చటి నైలాన్ చీర, నెరుస్తున్న వెంట్రుకల్ని చుట్టిన బన్నాముడి, స్లీవ్‌లెస్ బ్లౌజ్, లిప్‌స్టిక్, వయస్సు పెద్దదయినా, వేషం చాలా ఆధునికంగా వుంది. ఇంగ్లీషులో మాట్లాడాలన్న తాపత్రయమైతే వుందిగాని అంతగా వచ్చినట్టు కనపడదు.

మిసెస్ తివారి పొడుగు పొట్టి కాకుండావున్నా, లావాటి శరీరం, వయసుకి మించిన వేషం, మితభాషి. మాట్లాడుతున్నప్పుడు కల్నల్ భార్యనన్న ఠీవి, అధికారం కనబరుస్తూ మాట్లాడుతుంది. కప్పుకున్న షాల్, పెదాలకు రంగు, వగైరాలన్నింటిలాగే ఇంగ్లీషు మాటలు తరచు వదలడం కూడా ఆమెకొక ఫ్యాషన్.

మిసెస్ దారువాలా ముప్ఫైఏళ్ళ మనిషి. మంచి గులాబిరంగు ఛాయ, మంచి విగ్రహం, వంటి రంగులో కలిసే చీర, చేతులు, వీపులేని జాకెట్టు, చెవులు కనపడ కుండా నడినెత్తిన చుట్టిన ముడి, లిప్‌స్టిక్-ఒయ్యారంగా ఒరిగి కూర్చుని ఎవరితోనో ఉల్లాసంగా మాట్లాడుతూంది.

శాంతి బెదురుతూ చుట్టూ చూసింది.

మిసెస్ రంజిత్‌సింగ్, పొడుగ్గా, లావుగా, మోటుగా, పంజాబీ దుస్తుల్లో అదోలా కనిపించే ప్రక్క పాపిడితో, చుట్టూ వున్న వాళ్ళంతా ఒక మెట్టు తక్కువ అన్నట్టు చూసి మాట్లాడుతూంది.

మిసెస్ థామస్ పొడుగు. ఫ్రాక్‌మీద పుల్‌వోవరు, ఎత్తు మడమల జోళ్ళు, కత్తిరించిన జుట్టు, నలుపుమీద వికారంగా కనిపించే పెదాలరంగు. తన దీ దేశంకాదని అందరూ అనుకోవాలన్నట్టుంది.

మిసెస్ తులానీ నన్నగా, పొడుగ్గా, తెల్లగా వుండి, పల్చటి సిల్కు చీర, దానికి మేచయ్యే స్లీవ్‌లెస్ బ్లౌజ్, నడినెత్తిన చుట్టిన సిగలోంచి వెండి ఫిలిగ్రీ వర్కుతో చేసిన కుచ్చులు వేలాడుతున్నాయి. చెవులకి పొడుగాటి జూకాలు, పొడుగాటి లాకెట్ గొలుసు, గాజులు, నగలు, చెప్పులు, హాండ్‌బాగ్ అన్నీ చీరలకి మేచయ్యేటట్లు వున్నాయి. కార్డిగాన్ తొడుక్కుని, మధ్య మధ్య షోగ్గా సిప్ చేస్తూ, "ఈ కాలంలోనూ ఇలాంటి వాళ్ళుంటారా?" అన్నట్లు వింతగా చూసింది శాంతి వంక.

ఇంకా ఆ ప్రక్క మిసెస్ దేశ్‌ముఖ్- ఇంచుమించు పైమాదిరి వాళ్ళలానే వేషం, ఆధునికత ఉట్టిపడుతూ.

వీళ్ళందరికీ అతకని మనిషి మిసెస్ మీనన్ ఒకతే. మంచి కళగల మొహం. జరీలేని కంచిచీర, అదే రంగు జాకెట్టు, రింగు చుట్టిన ముడి, కుడిచేతికి బంగారు గాజులు, ఎడంచేతికి వాచి, కేపు కప్పుకుంది.

శాంతికి చెప్పలేని దిగులు ఆవహించింది.

"తీసుకోండి" నల్లరంగు డ్రింక్ ఒక గ్లాసులో తెచ్చి అందించాడు మెహ్రా, మొహమాటపడి, ఇబ్బందిగా చూసింది శాంతి.

"అందరూ తాగుతున్నప్పుడు మీరు త్రాగకపోవడం ఆచారంగాదు, మీ కింకా క్రొత్త. కొన్నాళ్ళు పోతే మీకే అలవాటు అవుతాయి, ఈ కట్టుబాట్లు!" మిసెస్ అరోరా చిన్నపిల్లలకి చెప్తున్నట్లు నవ్వుతూ అంది.

"కోకోకోలా తాగడానికి అభ్యంతరం ఏమిటండీ?" నవ్వాడు మెహ్రా. శాంతి మెల్లిగా గ్లాసు అందుకుంది. నలుగురి మధ్య క్రొత్తదనంతో మధనపడడం కన్నా,

అలో క్రొత్తదానిలా, తెలియనిదానిలా అందర్లోనూ తేలిపోవడం మరింత బాధాకరంగా వుంది.

కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు మెహ్రా. మిసెస్ అరోరా, మిసెస్ తివారి ఎవరితోనో కబుర్లలో పడ్డారు. కాంతి గ్లాసు ఖాళీచేసి చుట్టూ చూసింది. ఎవరి చేతుల్లోనూ గ్లాసు ఖాళీగా లేదు. మిగతా అంతా తాగడం మానేసి ఉత్తినే చేతుల్లో పట్టుకుని మధ్య మధ్య కొద్దిగా గుటక వేస్తున్నట్టు వుంది. క్షణక్షణం తప్పులు చేస్తున్నట్లనిపించింది కాంతికి. మిగతా అందరి వేషభాషలకీ, తనకీ మధ్యనున్న అంతర్యం, తన ప్రవర్తన మూలాన మరీ ఎక్కువౌతూందన్న భయమొకటి ఆమెని కొత్తగా వెంటాడసాగింది!

సరిగ్గా ఎనిమిదిన్నరకి హాలు నిండా కలకలం ఆగింది. మగవాళ్ళంతా గుమ్మం ముందు గుమిగూడారు. కరచాలనం జరుగుతోంది. జనరల్ దిగాడన్నమాట! బాండ్ వాద్యం ఎక్కువగా వినబడుతోంది. ఆడవాళ్ళ మాటల సద్దు కొద్దిసేపు ఆగింది. అందరూ అటువైపు చూడసాగారు.

పొడుగ్గా, బట్టతలతో, భారీగా వున్న ఒక మనిషి ఆడవాళ్ళ మధ్యకి వచ్చారు. ప్రక్కన బ్రిగేడియర్ నిలబడి ఒక్కొక్కరినే పరిచయం చేస్తున్నాడు.

కాంతి దగ్గర నిలబడ్డాడు జనరల్ నవ్వుతూ నమస్కరించి. కాంతి సిగ్గుపడి సంభ్రమంతో నిలబడి నమస్కరించింది. బ్రిగేడియరు పేరు తెలియక కొద్దిసేపు ఇబ్బందిపడి చివరకు "క్రొత్తగా వచ్చారు!" అన్నాడు.

"మిసెస్ రావ్" మిసెస్ అరోరా చెప్పింది.

"హూర్స్ండీ. ఎక్కడినుంచి వచ్చారు?" అడిగాడు జనరల్ నవ్వుతూ

"రాజమండ్రి"

"రాజమండ్రి- ఎక్కడుంది? బెంగుళూరు దగ్గిరా?" అయోమయంగా బ్రిగేడియర్ వంక చూశాడు జనరల్.

"మెడ్రాస్ దగ్గిర అనుకుంటాను!" తనకీ తెలియనట్లు చూశాడు బ్రిగేడియర్.

కాంతికి తను చేసిన పొరపాటు అర్థమయింది. కాని సరిదిద్దుకునే లోపునే జనరల్ ప్రక్కకి వెళ్ళిపోయాడు. జనరల్ వెళ్ళాక, సన్నగా మిసెస్ తివారి చెప్పింది.

"మీరు తెల్సుకోవాల్సిన విషయాలు కొన్ని వున్నాయి. మీకు తెలియకపోయినా చుట్టూ జూచి వుండాల్సింది. జనరల్ వచ్చినప్పుడు మీరు లేవనక్కరలేదు. కూర్చునే

నమస్కరించాలి. తర్వాత బ్రిగేడియర్ మీ పేరు తెలియక ఇబ్బంది పడుతున్నప్పుడు మీ అంతట మీరే మీ పేరు చెప్పుకోవాలి."

శాంతికి చెమటలు పోశాయి. ఇంకా కూర్చుంటే ఏమవుతుందో తెలియనట్లుంది. కానీ వెళ్ళడం ఎలా?

పదకొండు కావస్తూంది అప్పటికిగానీ ఎవరూ డిన్నర్‌కి వెళ్ళలేదు. రావు అప్పుడు కనబడ్డాడు శాంతికి. కళ్ళు ఏవో లోకంలో ఉన్నట్టున్నాయి. ఆమె అతన్ని ఎరిగినట్లు లేదు. చేతులూ, కాళ్ళూ చాలా విసురుతో కదులుతున్నాయి.

"డార్లింగ్! ఎలా వుంది?" నవ్వుతూ అడిగాడు రావు. అదోలా వాసన తగిలింది శాంతికి.

డిన్నర్ అయి బయటికి వచ్చిన మరో పావుగంటకి హాల్లో వాద్యం మొదలైంది. జంటలు కదులుతున్నాయి హాలు మధ్యకి. మగవాళ్ళు దగ్గిరకి వచ్చి అడుగుతున్నారు, ఆడవాళ్ళు లేస్తున్నారు. శాంతి గుండెలు గబగబ కొట్టుకున్నాయి.

"మీతో డాన్సు చేసే గౌరవం నాకు కలిగిస్తారా?" కల్నల్ తివారి మర్యాదగా వంగి అడిగాడు.

"క్షమించండి, నావల్ల గాదు!" ఎలాగో అనగలిగింది.

"పర్వాలేదులెండి" కల్నల్ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఒకరిద్దరు ఇలానే అడిగి వెళ్ళిపోయారు. డాన్స్‌కి డాన్స్‌కి మధ్య పచ్చని, తెల్లని ముదురు నల్లని రంగుల పానీయాలు తాగుతున్నారు మగవాళ్ళు. గంటలు గడిచినకొద్దీ నవ్వులు, కేకలు ఎక్కువ అవుతున్నాయి. కాళ్ళు తడబడ్తూంటే, మాట అస్పష్టమవుతూంటే ప్రతి మనిషి ఏదో వెర్రిగా మాట్లాడుతూ, బాండ్ వాద్యానికి లయగా అడుగులు వేస్తున్నారు.

రావు వచ్చి తనని డాన్సు చేయమని అడిగితే ఎంత బాగుణ్ణనుకుంది శాంతి. రావు ఎక్కడా కనపడడంలేదు. ప్రతి అయిదు నిమిషాలకి ఎవరో వచ్చి అడగడం, ఒకోసారి కొద్దిగా బలవంతం పెట్టటం కూడా జరుగుతూంది. ఎంత కాలమని తప్పించుకోడం?

రాత్రి రెండున్నర దాటింది. అప్పటికింక మగవాళ్ళెవరికి రెండో మనిషి చెపుతున్నది వినపడుతున్నట్టు లేదు.

"మీరింతవరకూ డాన్స్ చెయ్యనేలేదు!"

తలెత్తింది శాంతి.

ఎదురుగా జనరల్ భగత్!

"నాకు డాన్స్ రాదండీ!"

"డాన్స్ రాకపోవడమేమిటి? నాలుగడుగులు ఇటూ అటూ వేయడానికి! రండి నేను నేర్పుతాను."

శాంతి ఏం మాట్లాడలేకపోయింది. జనరల్ చెయ్యి చాచాడు. బాండ్ వాద్యం మొదలైంది. జనరల్ ఆమె చేతిని పట్టుకుని ముందుకీ, వెనక్కీ ప్రక్కలకీ అడుగు వేసాడు ఆమె మొదటిసారి ఫ్లోర్ మీదకి రాగానే చుట్టూ అంతా డాన్స్ మానేసి చప్పట్లు చరిచారు. శాంతి మొగం సిగ్గుతో కందింది.

"క్షమించండి, ఇంక చాలు, నాకు అలసటగా వుంది" అంది శాంతి బాండ్ ఆగగానే.

"మరేం ఫరవాలేదు-రండి" జనరల్ ఆమెని సోఫాదాకా తీసుకెళ్ళి కూర్చున్నాక, మర్యాదగా వంగి కృతజ్ఞతచెప్పి గుంపులో కలిశాడు. ఆమె వెంటనే లేచి ఎవరూ లేని మూలకి చేరి కూలబడింది. ఆ ప్రక్కనే మిసెస్ మీనన్ వుంది.

"ఇంకా ఎంతసేపుంటారు, వీళ్ళంతా?" అడిగింది శాంతి.

"జనరల్ ఇష్టం. అతను వెళ్ళేదాకా ఎవరూ కదలరు!" నవ్వుతూ అంది మీనన్. రావు దూరంగా కనపడ్డాడు. నిలబడి ఎవర్తోనో మాట్లాడుతూ, సైగచేసి పిల్చింది శాంతి.

"వెళ్దాం ఇంక" అంది శాంతి నిద్రకి వాల్తున్న కళ్ళతో.

"డోంట్ బి సిల్లీ!" రావు నవ్వి వెళ్ళిపోయాడు.

శాంతికి నిద్ర ముంచుకు వస్తోంది. మిగతా అంతా ఎలా నిబ్బరించుకుంటున్నారో అర్థం కాలేదు. మొదట్లోవున్న బెరుకు, కొత్తదనంపోయి విసుగుదల హెచ్చయింది. డాన్స్ తర్వాత డాన్స్, చివరకది ఏ రకం డాన్సో తెలుసుకోలేని విధంగా తయారైంది.

మూడున్నర గంటలవేళ, "ఒకే ఛాప్స్! థాంక్యూ, గుడ్‌నైట్!" అని చెప్పి, ఆడవాళ్ళందరికీ నమస్కరించి, కారుకేసి నడిచాడు జనరల్. జనరల్ వెనకాలే బ్రిగేడియర్, కల్నల్స్ అందరూ నడిచారు.

దారి పొడుగునా, ఇంటికి వచ్చాక, శాంతి రావుతో ఏమేమో మాట్లాడాలనుకుంది. ఎన్నో అడగాలనుకుంది. అక్కడి కొందరి మనుషుల ప్రవర్తనని, వాళ్ళ ఆచారాలమీద, పద్ధతులమీద తన అభిప్రాయాల్ని ఏవేవో చెప్పాలనుకుంది. చర్చించా

లసుకుంది. కానీ ఇంటికిరాగానే బట్టలైనా మార్చకుండా మంచంమీద పడి నిద్ర పోయాడు రావు.

* * *

మర్నాడు ఉదయం తొమ్మిదిన్నరకి లేచాడు. స్నానం వగైరాలు కానిచ్చి వచ్చేసరికి పదిన్నర అయింది. అప్పటికి శాంతి వంట కూడా పూర్తయింది.

రావుకి కాఫీ అందిస్తూ, ఏ భావం వెలిబుచ్చని అతని మొహంలోకిచూసింది. క్రితం రాత్రి కళ్ళలో మైకం ఆమె కళ్ళముందు కదిలింది.

"మీరు తాగుతారని నాతో ఎప్పుడూ చెప్పలేదేం?"

"అదేమంత ఘనకార్యమని ప్రకటించుకోవాలి?"

"తాగకపోతేనేం?"

రావు నవ్వాడు. సమాధానం చెప్పలేదు.

"రాత్రి నేనున్నాననే సంగతే మీకు గుర్తున్నట్టు లేదు!"

"నిన్ను కనిపెట్టి చూస్తూనే వున్నాను. నువ్వు ఎవరితోనూ మాట్లాడకుండా తల దించుకు కూర్చోడం జనరల్ వచ్చినప్పుడు నిల్చుని తడబడడం, నిన్నందరూ డాన్స్‌కి పిలవడం, నీవు విచిత్రచూపులు చూడడం, చివరన జనరల్‌తో డాన్సు, ఆఖర్న అక్కడ మిసెస్ మీనన్ దగ్గరికివచ్చి సగం నిద్రలో కూలబడ్డం - అంతా చూస్తూనే వున్నాను!"

శాంతి సిగ్గుపడి తల దించింది.

"చూడు శాంతీ, నీకు, నాకూ ఇష్టమున్నా లేకపోయినా మనం ఇక్కడికి వచ్చాం ఇప్పుడు. ఇక్కడున్నప్పుడు ఇక్కడి పద్ధతులు, అలవాట్లు, కట్టుబాట్లు పాటించడం మంచిది. ఎప్పుడో ఒకసారి తాగినంత మాత్రాన పోయేదేం ఉండదు. కానీ తాగకపోతే, నలుగుర్లోనూ వెలితిగా ఉన్నట్టవుతుంది. అలాగే నువ్వు అందర్లా కాకుండా ఎవరితో మాట్లాడకుండా ఒక తైవీ కూర్చుంటే పోయేది వుండదుగాని, సాంఘికంగా వెనకబడినట్టు చూశారంతా. వాళ్ళకా అవకాశం ఎందుకు కలిగించాలి?"

"అయితే నేనూ డాన్స్ చేయాలంటారు?"

"ఏమిటి పోతుంది డాన్స్ చేస్తే."

"మీరెన్ని చెప్పండి, నావల్ల కాదు. అలా పరాయి మగవాణ్ణి పట్టుకుని....అసలీ విదేశీ పద్ధతులు, అలవాట్లు మన దేశంలో ఎందుకో ఇంకా?"

రావు మళ్ళీ నవ్వాడు. శాంతి కళ్ళలోకి చూసి. ఆ నవ్వుకి శాంతికి కోపం వచ్చింది. "నువ్వు ఏం తెలియని అమాయకురాలివని" చెపుతోన్నట్టుంది, ఆ నవ్వు.

"మీరలా నవ్వితే నాకు కోపం వస్తుంది."

"నీకు కోపం వస్తే నాకు బాగుంటుంది" ప్రేమగా నవ్వాడు రావు.

మొదట కొన్ని క్షణాలు ఏం చెప్పాలో తెలియని సందిగ్ధంలో పడింది శాంతి. తర్వాత ఆమె మనసులో మాట చెప్పుకోవాలన్న ఆత్రుత ఎక్కువవుతూంటే మెల్లిగా మొదలుపెట్టింది.

"నిన్న రాత్రి నన్ను వాళ్ళంతా ఏదో వింత వస్తువుని చూసినట్టు చూస్తూంటే నాకెంత చిన్నతనమనిపించిందో తెలుసా? వాళ్ళకన్న ఏదో తక్కువ అన్నట్టుచూసి మాట్లాడడం! కొత్తలో తెలియక ఏదో చిన్న పొరపాట్లు చేశానే అనుకోండి. అంత మాత్రాన మరీ అంత ఇదిగా మొగంమీద చిన్నబుచ్చుకునేలా చెప్పాలేమిటి?

రావు నవ్వాడు, మళ్ళీ అదే ధోరణిలో.

"శాంతీ డార్లింగ్! నిన్న నీ వేషంచూస్తే నాకేమనిపించిందో చెప్పనా? కోపం తెచ్చుకోకూడదు సుమా!"

"చెప్పండి. ఫరవాలేదు"

"పందొమ్మిదో శతాబ్దపు ఆదర్శ భారత నారీమణి అని బిళ్ళ ఒకటి మెళ్ళో వేళాదేసి మ్యూజియంలో పెట్టాలనిపించింది."

"మీకు అలా అనిపించీ ఎందుకు చెప్పలేదు?"

"నేను చెపితేకన్నా, నలుగురిలోనూ చూస్తే నీకే తెలుస్తుందని వూరు కున్నాను!"

శాంతి చాలాసేపు మాట్లాడలేదు.

"శాంతీ! నువ్వు తెలివైనదానివి. చదువు, అందం, జ్ఞానం, వివేకం అన్నీ వున్నాయి. నిన్ను చూస్తే నాకెంత గర్వంగా ఉంటుందో తెలుసా—అయినా నువ్వు కొంచెం మారాలి శాంతి. రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లాగ ఉండమని ఒక సామెత వుంది. అలా ఇక్కడున్నప్పుడు ఇక్కడి వాళ్ళలాగా ఉండడం అవసరం. వాలుజడలు. జడకుచ్చులు మానేసి ఇప్పటి ఫేషన్ ప్రకారం ముడులు చుట్టుకోడం, ఎప్పుడూ కంచి జరీ పట్టుచీరలే కాకుండా నాజూకువి కట్టడం మొదలైనవన్నీ పెద్ద విషయాలేం కావు: నీకిష్టమైతే మారడం నీ చేతిలో పని. ఇదివరకు నేను ఒకటి రెండుసార్లు చూచాయగా అన్నా నీవు పట్టించుకోలేదు. అలా మారితే నలుగురి

లోనూ కలసి మెలసి ఉండడం సులభమైనప్పుడు అలా ఎందుకుండకూడదు? పోయేదేముంది ఇంతలో ఇక్కడింకోటి గుర్తుంచుకో. అందరితో కలసి మెలిసి ఉండడంవల్ల నీ గౌరవం హెచ్చడమే కాకుండా, సాంఘికంగా స్థాయి కూడా హెచ్చవుతుంది. మిగతా చోట్లలాకాదు ఇక్కడ. మిగతా ఉద్యోగాలలా కాదు ఆర్మీ ఆఫీసరు ఉద్యోగం. అదా, మగా అంతా చనువుగా కలిసి వుండేచోట, నీవు వెలివడినట్లు వుంటే నీతోపాటూ నేనూ వెలిగా ఉండిపోతాను! ఒక రకంగా చూస్తే నలుగుర్లోనూ నా పరపతి, గౌరవం నీమీద ఆధారపడుంటాయి!"

"అయితే స్లీవ్‌లెస్‌బ్లౌజ్, లిప్‌స్టిక్‌లు, నైలానులు వాడకపోతే అనాగరికుల క్రిందే లెక్కా?"

"అదికాదు శాంతి, లోకంతో పాటే, మనమూ. రోజులు మారుతున్నాయి. ఎప్పటి కాలానికి తగ్గట్టు అందరిలా వుంటే తప్పేముంది."

"అయితే రేపట్నుంచి స్లీవ్‌లెస్ బ్లౌజులు, లిప్‌స్టిక్, షిఫాన్ చీరలు, కొత్త రకం హెయిర్ స్టయిల్సు మొదలుపెడతానుండండి. డాన్సు పాఠాలు కూడా నేర్చుకోమంటారా?"

"డాన్స్ అంటే నీకిష్టంలేదని తెలుసు. కానీ అందులో తప్పేం కనబడదు నాకు! ఇదంతా పెద్ద కుటుంబం, ఇక్కడున్న ఆఫీసర్లు అందరూ నీకు సోదరుల్లాంటి వారు. మనసులో ఆ భావం ఉన్నప్పుడు పరాయి మగవాణ్ణి తాకామన్న ఆలోచన రాదు. పవిత్రత అన్నది మనసులో వుంటుంది. నిన్న జనరల్‌తో డాన్స్ చేశావు. నీకేమనిపించింది? అతనికి నీ తండ్రి అంత వయసు వుంటుంది. అతను నీ చేతిని పట్టుకుని కాసేపు అటూ ఇటూ తిరిగితే ఇందులో అపచారం, అవినీతి ఏముంటుంది చెప్పు?"

"....నేనేదో తేలిగ్గా మాట్లాడితే, మీరెందుకింత సీరియస్‌గా ఉపన్యాసాలు దంచుతున్నా...." చిలిపిగా అతని జుట్టు రేపింది శాంతి.

* * *

"క్లబ్బులో యివాళ రాత్రి పిక్చరున్నట్టు చెప్పలేదేం? నిన్న సర్క్యులర్ వచ్చిందటగా?" మధ్యాహ్నం భోజనం చేస్తూ అడిగాడు రావు. ఆఫీసులో మీనన్ మాటల సందర్భంలో "పిక్చర్‌కు వస్తున్నావా?" అని అడిగేవరకు రావుకి తెలియదు.

"ఎలాగూ వెళ్ళడం అవదని చెప్పలేదు."

"ఏం? ఎందుకు అవదు? రాత్రి భోజనం చేసి ఏడు గంటలకి వెడితే పది లోపల వచ్చేస్తాం, ఇందులో వీలవకపోవడానికి ఏముంది?"

"బాబుకి తొమ్మిది గంటలకి ఫీడింగ్ టైమ్, సుజాకి అన్నం అది ఎవరు పెడతారు?"

"ఒక్క పూటకు మరేం కొంప మునగదులెద్దూ, ఆయా, రాము ఉన్నారుగా! సుజాకి అన్నం పెట్టి పెడదాం, ఆయా బాబుకి పాలు పడుతుంది. మంచి పిక్చర్!"

* * *

"తొందరగా కానియ్యి, టైమయ్యింది." టై కట్టుకుంటూ కేక వేశాడు రావు.

"అయిపోయింది!" అంటూ వచ్చిన కాంతిని చూసి నుదురు చిట్లించాడు రావు.

"మళ్ళీ అదే వేషం! ఎప్పుడూ ఆ పట్టుచీరలే కాకపోతే మొన్న కొన్న షిఫాన్ చీర కట్టుకోకూడదూ? ఆ నల్ల పూసలూ, మెట్టెలు ఒక్క పూటకి తీసేస్తే మరేం పాతివ్రత్యానికి భంగం రాదులే! శోభనం పెళ్ళికూతుర్లా అన్ని పూలేమిటి? ముడి చుట్టుకోకూడదు!" కాంతిని ఆపాదమస్తకం పరీక్షిస్తూ అన్నాడు రావు.

కాంతి ఇబ్బందిగా మొహం పెట్టి "ఏమిటో నాకు వాలుజడే కంఫర్టబుల్‌గా వుంటుంది. ఆ ముడి నాకు సరిగా కుదరదు. ఇప్పుడు మొదలుపెడ్తే ఓ అరగంట పడ్తుంది. ఈసారికి ఇలా రానిద్దురూ!" చూపులు తప్పిస్తూ అంది.

మౌనంగా స్కూటర్ స్టార్ట్ చేశాడు రావు.

"ఆయా, బాబుకి సరిగా తొమ్మిది గంటలకి పాలు పట్టు. ఫ్లాస్కులో పోశాను. సుజాను ఏడిపించకుండా పడుకోబెట్టు రామూ!"

"ఏమిటి ఓ రెండు గంటలకి అన్ని అప్పగింతలు పెడుతున్నావు: ఏది నీ కార్డిగాన్ తెచ్చుకోలేదా?"

"ఫర్వాలేదు లెద్దురూ, ఇవాళ అట్టే చలిగా లేదు. మళ్ళీ లోపలికి వెడితే ఆలస్యం." రావు కింకేం చెప్పాలో తెలియలేదు.

* * *

ట్యూబ్‌లైట్ల కాంతిలో క్లబ్బంతా వెలిగిపోతూంది. రకరకాల మనుష్యులు, రకరకాల ఫ్యాషన్లు. కొందరు అటూ యిటూ తిరుగుతూ పరిచితుల్ని పరామర్శిస్తున్నారు. కొందరు నిల్చుని మాట్లాడుతున్నారు. కొందరు అక్కడ వేసిన కుర్చీల్లో కూర్చుని మాగ్‌జైన్లు తిరగేస్తున్నారు. పిక్చరు ఇంకా ఆరంభించలేదు. అది అక్కడ పనిచేసే ఆఫీసర్ల కోసం ప్రత్యేకించిన క్లబ్బు. ఓపెన్ ఎయిర్ థియేటర్లో వారానికి ఒకసారి సినిమా వుంటుంది. రోజూ పేకాట, బిలియర్డ్స్, టెన్నిస్.... ఆటలో బాటు అప్పుడప్పుడు డాన్సులూ, డిన్నర్లూ కూడా జరుగుతూంటాయి.

రావుని, కాంతిని గమనించి కూడా ఎవరూ పట్టించుకోలేదు. ఆ రోజు మెస్‌లో పరిచయం అయినవారే కాకుండా ఇంకా చాలామంది వున్నారు. ఆడవాళ్ళ నవ్వుల్తో క్లబ్బు ఎగిరిపోతూంది. క్రితం సారికంటే యింకా ఎక్కువ ఆడంబరంగా తయారయారు అందరూ. ఒక్కొక్కరు ఒక్కొక్క ఫాషన్‌కి నమూనా అన్నట్లు.

రావు మొహం చూచి, అతని భావం అర్థం చేసుకుని ఆడవారి గుంపులోకి నడిచింది కాంతి. అంతవరకూ పెద్దగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళంతా ఒక్కసారి మౌనం వహించారు.

ఇవాళ ఎంత సుదినం? మీరు క్లబ్బుకి వచ్చారు!" మిసెస్ తివారి అడిగింది. కొంతసేపటికి హాస్యం, హేళన మిలాయించి, అంతా ముసి ముసిగా నవ్వి కళ్ళతో మాట్లాడుకుంటున్నారు.

"రోజూ సాయంకాలం ఏం చేస్తారు? సాయంకాలం ఓ గంట క్లబ్బుకి రాకూడదూ?" మిసెస్ తివారి అడిగింది.

"వీలునుబట్టి చూస్తాను" వాళ్ళ అహంభావాన్ని సహించలేక ఆదోలా అంది కాంతి.

సినిమా మొదలైంది. లైట్లారిపోయాయి.

"చూశావా, యివాళ కూడా నీతో సరిగా మాట్లాడలేదు.... నీ ధోరణి మారే వరకూ మనని అందరూ అలాగే ట్రీట్ చేస్తారు!" త్రోవలో అన్నారు రావు.

కాంతి మనసులో చెప్పలేని ఆందోళన చెలరేగింది. బలమైన శక్తులేవో తనకి ఇష్టం లేని దారివెంట బొమ్మని తనని తోస్తున్నట్టయింది.

* * *

"అరే,....యిది కలా, మాయా? నన్నునుగ్రహించి దిగివచ్చిన అప్సరసా?" స్లీవ్‌లెస్ బ్లౌజ్, షిఫాన్ శారీ, చెవులు కప్పుతూ నడినెత్తిన చుట్టిన సిగ, లిప్‌స్టిక్, నాజూకు స్లిప్పర్లు, నవ నాగరికంగా కనపడిన కాంతిని చూడగానే ఆశ్చర్యపోయాడు రావు.

"ఏం, తృప్తి అయిందా మీకు? ఇంకా ఏమయినా మిగిలియా?" కొంచెం నిష్టూరంగా అన్నది కాంతి భుజం తడ్తూ.

"కోపమా కాంతీ! ఎంత బాగున్నావో తెలుసా యిలా?... వాళ్ళందరి కంటే నీకు ఈ స్టయిల్ చాలా బాగా అమరింది. గుడ్ గర్ల్! యు లుక్ వెరీ స్మార్ట్! ఇలా చెప్పినట్లు వింటే నాకెంత బాగుంటుందో తెలుసా?" మురిపెంగా చూస్తూ దగ్గరకు తీసుకున్నాడు.

"పదండి, క్లబ్బుకి వెడదాం" కాఫీ ఇచ్చాక అంది కాంతి.

"ఏమిటీ ఉప్పెన? ఇదంతా నామీద అనుగ్రహమా? హాస్యమా? కోపమా?"

"ఎందుకంత ఆశ్చర్యపోతారు? ఇకమీదట మీ యిష్టం వచ్చినట్టే ఉండదల్చుకున్నాను.... కాంతి, మిసెస్ రావుగా కొత్తరూపం దాల్చదల్చుకుంది అంతే! ఇవాళ మిసెస్ తులాని దగ్గిరికి వెళ్ళి కొత్తరకం హెయిర్ స్టయిల్స్ నాలుగయిదు నేర్చుకు వచ్చాను. ఆమె డాన్సు కూడా నేర్పుతానంది. ఇకమీదట నాతో రావడం మీకు తల వంపుగా వుండదు!"

"తలవంపు అని నేనెప్పుడయినా అన్నానా? నన్నెందుకు అర్థం చేసుకోవు? అందరికంటే చదువు, అందం అన్నీ ఎక్కువే అయినా, అందరిముందు తీసి కట్టుగా వుండడం ఎందుకన్నాను! అంతేగా?" అనునయంగా అన్నాడు రావు ఆమెని శాంత పరచాలని.

"సర్లెండి, మిమ్మల్ని నేనేమీ అనడం లేదు, వూరికే అన్నాను. వెళ్దామా మరి!" క్లబ్బులో అందరూ కాంతిని పరీక్షగా చూశారు. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఆనాడు అందరి కళ్ళూ ఆమె మీదనే వున్నాయి.

* * *

"ఇవాళ మిసెస్ దారువాలా ఫోన్ చేసింది. నాలుగు గంటలకి "లేడీస్ పార్టీ" వుంది రమ్మని! వెళ్ళనా?" మధ్యాహ్నం టేబిల్ దగ్గర అడిగింది కాంతి.

ఎన్నడూ పార్టీలకు వాటికి ఎన్నోమార్లు అడిగితేగాని రాని కాంతి తనంతట తానుగా అడగడం ఆనందం, ఆశ్చర్యమూ కలిగించింది.

"తప్పకుండా వెళ్ళు. ఇందులో అడిగి వెళ్ళేందుకు ఏముంది కాంతి! పిల్లల గొడవ నేను చూసుకుంటానులే!"

"తొందరగా వచ్చి, వచ్చాక చేస్తాను వంట."

"చూడు తిండి అన్నది పెద్ద ఆలోచించాల్సిన విషయం కాదు. నువ్వక్కడ నించి వచ్చాక వంట చేయక్కరలేదు! ఏ క్యాంటీన్‌లోనో కానిచ్చేద్దాం ఇవాల్టికి!"

అర్థం చేసుకున్నట్టు నవ్వింది కాంతి.

* * *

"ఏం ఇంకా రావడం లేదా మీరు? ఏం చేస్తున్నారు ఇంతసేపు?" మామూలు వేళ దాటిపోయాక ఆఫీసుకి ఫోను చేసింది కాంతి.

"సారీ డియర్, ఇప్పుడిప్పుడే రావడానికి వీలవదు, ఏం?"

"మీరు వస్తే క్లబ్బుకి వెడదామని రెడీ అయి కూర్చున్నాను."

"వెరీ సారీ, నాకివాళ వీలవదు. రేపు వెడదాంలే" ఫోను పెట్టేయబోయాడు.

"మిసెస్ మీనన్ ఇక్కడికి వచ్చింది. రమ్మంటూంది. ఆవిడతో వెళ్ళనా?"

"వెళ్తావా? సరే వెళ్ళు."

"తొందరగా వచ్చేస్తానులెండి. బై. బై."

* * *

"అబ్బ ఇంత సేపు చేశావేమిటి? బాబు ఎందుకో ఏడ్చి ఏడ్చి ఇప్పుడే నిద్ర పోయాడు. సుజా ఆకలి అని ఏడుస్తూంది" ఎనిమిది గంటలకి తిరిగివచ్చిన శాంతిని చూసి కొంచెం చికాకుపడ్డాడు రావు.

"ఏం ఎందుకు ఏడ్చాడు బాబు? పాలుపట్టి వెళ్ళానే? ఆయా ఏం చేస్తూంది? బేబీకి ఆకలంటే అన్నం పెట్టకపోయారా? వండి వెళ్ళాను!"

"ఇంత సేపూ అక్కడ కూర్చోడమెందుకు?" ఆఫీసులో పనిభారం రావుమీద పనిచేసింది.

"కార్డ్సులో కూర్చుంటే టైం తెలియలేదు. అంచులో రమ్మీ! మొదట అయిదు రూపాయలు పోగానే కసి ఎక్కువైంది. దాంతో ఇంకో పదిరూపాయలు పోయాయి. అందులో సగమైనా రాబట్టాలని కూర్చుంటే ఈవేళ అయింది!"

"సరే, ఏదో ఒకటయింది! ఇకనైనా త్వరగా కానియ్యి."

"నిన్న పర్సులో నూటయాభై వుండాలి. ఇప్పుడు ఏభయ్యే ఉన్నాయి. నీవేమైనా ఖర్చు చేశావా శాంతీ?" పర్సు చూసుకుంటూ అడిగాడు రావు.

డ్రెస్సింగ్ టేబిల్ దగ్గిర కూర్చుని కనుబొమలు పెన్సిలుతో దిద్దుకుంటున్న శాంతి నిర్లిప్తంగా, "నిన్న బాటా షాపులో షూస్ వచ్చాయంటే మిసెస్ దారువాలాతో పాటూ నేనూ తీసుకున్నాను. దానికో ఇరవై, టెయిలర్‌కో ఇరవై. మొన్న మిసెస్ తులానీ కొన్నలాంటి చీర ఒకటి నలభై రూపాయలకి తీసుకున్నాను. ఎల్లుండి పార్టీకి ఎడ్వాన్సు ఓ ఇరవై ఇవ్వాల్సి వచ్చింది!"

రావు నుదురు చిట్లించాడు. "టైలర్‌కి ఇరవై ఏమిటి? ఏం కుట్టించావు?

"వీపు మీద రకరకాల డిజైన్లు కత్తిరించి స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లు కుట్టడానికి ఎవరో ఎక్స్‌పర్ట్ టైలర్ వున్నాడంటే ఒక నాలుగు కుట్టమని ఇచ్చాను!"

"మిషన్ వుందిగా, నువ్వు కుట్టుకోలేకపోయావా?"

"నాకా ఫాషన్లు తెలియవు, అసలాక తీరుబడి లేదు."

ఇదివరకు ఇంట్లో పిల్లలవి, తనవి అన్నీ స్వయంగా కుట్టుకుని ఒక్క పైసా ఐనా దుబారా కాకూడదనే శాంతేనా అని ఆయోమయంగా చూశాడు రావు.

"ఎల్లుండి పార్టీ ఏమిటి?"

"మేమంతా వారానికి ఒకరింట్లో పార్టీ ఇచ్చుకోవాలని నిర్ణయించుకున్నాం. ఎల్లుండి నా వంతు, ఫక్తు ఆడవాళ్ళ పార్టీ. మీరా రోజు దయచేసి బయటికి ఎక్కడికైనా వెళ్ళాలని వేడుకుంటూ ఒకింత ప్రార్థన" నవ్వింది శాంతి.

"రేపు ఇన్సూరెన్సు ప్రీమియం కట్టాలని వుంచాను. అది కాస్త నీ ఫాషన్లకి, సరదాలకి ఖర్చు పెట్టేశావన్న మాట!" అదోలా అన్నాడు రావు.

"నాకేం తెలుసు, పొరపాటయింది, క్షమించండి" చిన్నపుచ్చుకుని అంది శాంతి.

"సర్లే.... తప్పు నాది!"

* * * *

వారం రోజులు ఏదో పనిమీద ఢిల్లీ వెళ్ళాడు రావు. ఆ రోజే తిరిగి వచ్చాడు. వచ్చేసరికి రాత్రి ఎనిమిదయింది. ఇంట్లో అడుగుపెట్టేసరికి సుజాత ఒక్కర్తే కనిపించింది మంచంమీద కూర్చుని ఆడుకుంటూ. ప్రక్కలు అన్నీ రేగి వున్నాయి. ఇంటి నిండా బొమ్మలు, పుస్తకాలు, బట్టలు అన్నీ పడి వున్నాయి. ఏవీ వుండాల్సిన స్థానంలో లేవు. కాసేపటికి ఆయా తిరిగివచ్చింది బాబు నెత్తుకుని.

"మేమ్ సాబ్ క్లబ్బుకి వెళ్ళారు! నేను బాబు ఏడుస్తూంటే ఆలా ఆడించడానికి తీసుకువెళ్ళాను. రాము బజారుకి వెళ్ళాడు. అమ్మాయిగారు అంతా చిందర వందర చేశారు!"

"ఇల్లంతా ఇలా వుందేమిటి? సుజాని ఒక్కర్తినీ వదిలి అంతా ఏమయ్యారు" అని కేకలు వేసిన రావుకి భయపడుతూ పరిస్థితి వివరించింది.

తిన్నగా క్లబ్బుకి బయలుదేరాడు రావు.

అడుగుపెట్టగానే శాంతి కనిపించింది డాన్సుఫ్లోర్ మీద జంటల మధ్య. అతనెవరో రావుకి తెలియదు. ఫాక్స్ట్రాట్ వాద్యానికి లయగా అడుగులువేస్తున్న శాంతి నేర్పుకి ఆశ్చర్యపోయాడు రావు. ఫాక్స్ట్రాట్ ఆగింది. వాల్ట్జ్ మొదలైంది. మళ్ళీ అతనితోనే అంత సులభంగానూ వాల్ట్జ్ చేసింది శాంతి.

రావు దగ్గర్లో ఒక ఫేం కుర్చీలో కూలబడి బేరర్ని "ఏక్ బడా వి. కె." తెమ్మని ఆజ్ఞాపించాడు.

డాన్సు కొద్ది నిమిషాల విరామం కోసం ఆగింది. మెడని పమిట చెంగుతో తుడుచుకుంటూ విలాసంగా నవ్వుతూ అతనితో టేబిల్ దగ్గిరికి నడుస్తున్న శాంతి రావుని చూసింది. అప్పటికి రావు బ్లాక్ నైట్ విస్కీ నాలుగు పెద్దవి రుచి చూశాడు.

"ఎప్పుడు వచ్చారు?" సంభ్రమంగా అడిగింది శాంతి ఎదురుగా కూర్చుంటూ.

(వనిత) ★

స వ ర ణ

స్వంత లాభం కథ - ఆఖరు పేజీలోనూ

వంకర గీతలు కథ - ఆఖరు పేజీలోనూ

పొరపాటున ముద్రణ జరుగలేదు.

ఇందుకు చింతించి ఆఖరున ముద్రించాం.

వం క ర గీ త లు

రావు మాట్లాడలేదు. చేతిలో గ్లాసుని గుండ్రంగా తిప్పాడు. శాంతికి సగం అర్థమయినట్టయింది, ఆ మౌనం.

"రండి. యింటికి వెడదాం" శాంతి లేచింది.

రావు ఆఖరి గుటక మింగి గ్లాసు బలంగా టేబిల్ మీద పెట్టి లేచాడు. రావు వెనకాల స్కూటర్ మీద కూర్చుని అతని భుజాలు రెండూ గట్టిగా పట్టుకుని తలని అతని వీపుకానించింది శాంతి. అతను పోతున్న వేగంలో, ఆ మౌనంలో అతని మనసు లోని భావాలు ఎన్నో వ్యక్తమవుతున్నాయి.

కళ్ళు చెదిరే ఆవేశంతో ఎటూ చూడలేక కళ్ళు మూసుకుంది శాంతి. ఏదో ఆవేదనరేగింది. కళ్ళెదుట రంగు రంగుల గీతలు నిలువుగా, వంకరగా, అడ్డదిడ్డంగా మెరుపుల్లా మెరిసి మాయమౌతున్నాయి.తను ఆ గీతల్లో బందీగా అనిపించింది.

తను గీత దాటిందా? వాటన్నింట్లో ఏది తను దాటగూడని గీత? అంతా చెల్లా చెదురుగా వుంది.

"అబ్బ ఏమిటా విసురు? తగ్గించండి" గట్టిగా అరిచింది శాంతి. వాలుగాలిలో అతనికి వినపడదన్న భయంతో.

"అంత భయం దేనికి? యింత వేగంతో పోవడం ఇదీ ఫాషనే!" పొడిగా అన్నాడు రావు.

శాంతి కళ్ళు మూసుకుని అతన్ని గట్టిగా పట్టుకుంది. ఆమె కళ్ళముందు ఎన్నో గీతలు మెరిశాయి వంకర టింకరగా, మెరుపుల్లా!

★